పెళ్ళి కాకుండా పిల్లను కన్నతల్లి ఏ ధైర్యంతో బ్రతుకుతుంది? ఆ తల్లి కన్న పిల్లకు ఎక్కువ ధైర్యం వుంటుందా....?


# మా అమ్మకి పెళ్ళి కాలేదు?

కె.పి.యస్. రామచంద్రరావు



సాధారణంగా ప్రతి స్కూల్లో వున్నట్లే ఆ స్కూల్లోనూ చుట్టూ తరగతి గదుల మధ్య మైదానం వుంది. జిల్లా క్రీడా మండలి వారు ఏర్పాటు చేస్తున్న పోటీలకై విద్యార్థినులకి తర్ఫీదు ఇస్తున్నారు టీచరు. ఆ మైదానంలోనే అందరికీ అన్నిరకాల సలహాలు అందజేస్తున్నారు టీచర్. బాలికల ఉన్నత పాఠశాల అనేమో! చాలా నిశ్శబ్దంగానే పోటీలకి తయారవుతున్నారు విద్యార్థినులు.

తరగతులలో పాఠాలు జరుగుతున్నాయి. కాని ఏ ఒక్క విద్యార్థినీ పాఠాలు వినటం




లేదు. అందరి దృష్టి మైదానంపైనే వుంది. ఇంగ్లీషు టీచర్ "లాంగ్ ఎగో" అని చెప్తుంటే "లాంగ్ షాట్" అన్నట్లు వినవస్తోంది. తెలుగు టీచర్ "అభిమన్యుడు రథాచక్రాన్ని పుచ్చుకున్నాడంటుంటే జానకి రింగ్ టెన్నిస్ ఆడుతోందనిపిస్తోంది. సైన్సు టీచర్ పక్షులు పాఠం చెప్తూ కాకులు పైకి ఎగరగలవంటుంటే 'జానకి' ఎంత పైకి ఎగరగలదనుకున్నారు. అంటే హైజంప్ ఫస్ట్ అనేటట్లున్నారు. సోషల్ టీచర్ "ఝాన్సీ లక్ష్మీబాయి కత్తి తీసుకుని యుద్ధ రంగంలో అడుగుపెట్టింది" అంటే జానకి బేడ్మింటన్ ఫస్ట్ రావాలి, అనుకుంటున్నారు. హిందీ టీచర్ వస్తూనే "చుప్ చాప్ బైఠియే" అంటుంటే జానకి నేర్పుతో కూడిన ఆటని చూడాలి అని "ఆప్ బైఠియే.... హమ్ జాయేంగే" అని ఆమె మాట వినిపించుకోకుండానే వెళ్ళిపోయారు.

అందరి పిల్లలతోనూ జానకిని కూడా పోటీలకి పంపించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలనుంచి పిల్లలు వచ్చారు. పోటీలు చాలా వుత్సాహాన్ని రేకెత్తిస్తూ సాగుతున్నాయి.

కరుణ ఆఫీసు పని పూర్తి చేసుకుని అప్పుడే ఇంటికి చేరింది. "నిన్న వెళ్ళిపోయిన అమ్మాయి జానకి ఎలా వుందో" ఒక్కసారి తల్చుకుంది. ఆమెకి నలభై సంవత్సరాలుండొచ్చు. నెరవటానికి తొంగి చూస్తున్న శిరోజాలు. చామనచాయ శరీరం, నాజూగ్గా అందంగా అమృత మూర్తిలాంటి హృదయంగల కరుణకి తోడు, నీడ ఆత్మబంధువు, పంచప్రాణాలు అన్నీ జానకే ఇంకెవరున్నారు?

అద్దె మాత్రం డెబ్బై రూపాయలు. ఇల్లు మాత్రం ఒక గదీ. ఒక కొట్టు. అవీ చిన్నవే. అయినప్పటికీ ఇలు చూసి ఇల్లాల్ని చూడమన్నట్లు ఎవరైనా చూస్తారన్నట్లే అంత శుభ్రంగా వుంటుంది ఆ ఇల్లు.

లంచ్ టైంలో భోజనానికి ఇంటికి రాకపోయినా ఆకలిగా లేదు. కాఫీ త్రాగాలని లేదు. మరేం చేయాలో అర్థంకాక వాలుకుర్చీలో కూర్చుని చిన్నారి జానకికోసం తలుపులవైపే చూస్తోంది.

ఇంటిముందు రిక్షా ఆగినట్లు శబ్దం. తను హాయిగా నిద్రపోతున్నట్లు నటించాలనుకుంది కరుణ.

భుజానికి బేగ్. చేతిలో రెండు యాపిల్ పళ్ళు పట్టుకుని ఇంట్లో అడుగుపెట్టింది జానకి. అమ్మ వాలుకుర్చీలో హాయిగా నిద్రపోతోంది. అమ్మని ఒక్కసారిగా ఆశ్చర్యపడేటట్లు చేయాలనిచప్పుడు చేయకుండా బేగ్ ప్రక్కన పెట్టి మోకాళ్ళపై వంగి కుర్చీ ప్రక్కనే నేలని కూర్చుని అమ్మని ముద్దు పెట్టుకుంది.

"అమ్మా.. అమ్మా.. నేను.. జిల్లాలో ఫస్ట్ వచ్చానమ్మా" సంతోషంగా చెప్తోంది.

కరుణకి జానకి ఫస్ట్ వస్తుందని తెల్సు. అందుకే నటిస్తున్న ఆమెని నవ్వించలేకపోయాయి జానకి మాటలు.

జానకికి వుడుకుమోత్తనం వచ్చింది. ఏంటమ్మా నేనేమో అక్కడ తిండి సహించక ఇక్కడికి వచ్చి అమ్మతో తిందాం అని యాపిల్ తెస్తే హాయిగా విశ్రాంతి కోసం వాలుకుర్చీలో పడుకున్నావు.

ఈ మాటలకి జానకిని గుండెలకి హత్తుకుంది తల్లి.

"లేదమ్మా వూరికే చిన్న యాక్షన్ చేశాను. నిన్న నువ్వు, నేను కలిసి భోంచేయడమేనమ్మా. మరింక తిండి సహించలేదు. నా బంగారుతల్లి వచ్చేసిందికదా! అంతా కలిపి ఇప్పుడు తినేస్తాను."

"పదమ్మా భోంచేద్దాం. ముందు ఈ యాపిల్ కోసి పెట్టమ్మా. ఈ లోగా స్నానం చేసి వస్తాను."

"ఆగమ్మా నా జానకి జిల్లా ఫస్ట్ వచ్చిందంటే ఈ తల్లి నువ్వు తెస్తావని అదే ఇవ్వాలని ఎదురు చూడటం లేదమ్మా! (ఎదురుగా సూట్‌కేసుని చూపిస్తూ) జానకీ ఆ సూటుకేసుమీద వున్న నా హేండ్‌బేగ్ ఆ పేకెట్స్ ఇలా పట్రామ్మా!"

జానకి తెచ్చి అందించింది. స్వీట్స్ పాకెట్ విప్పి తన చేత్తో కూతురి నోటికి అందించింది. ఆ తల్లికి కూతురే కదా! తనచేత్తో తల్లి నోటికి అందించింది స్వీట్. తల్లి మరో పాకెట్‌లోని బట్టలుతీసి కూతురికి అందించింది.

"అమ్మా బట్టలు కొన్నావా? ఎందుకమ్మా, నాకు వున్నాయిగా నువ్వు చీరె కొనుక్కోలేకపోయావా?"

"అలా అనకమ్మా జిల్లాకి ఫస్టు వచ్చావా? రేపు క్రొత్త బట్టలు వేసుకుని వెళ్ళి స్టేజీపై బహుమతి అందుకోవాలమ్మా నేను ఎటువంటిబట్టలేశానన్నది కాదమ్మా, ఎంత పని చేశానన్నది వారికి కావాలి."

"మరైతే, నన్ను మాత్రం ఏం బట్టలేశావని అడగటం లేదమ్మా, ఏ ప్రశ్నకి జవాబు వచ్చని అడుగుతున్నారు.

"పాఠాలు, ప్రశ్న - జవాబులు చద


## తెల్ల మచ్చలు

మా ఆయుర్వేదిక్ మందు 3 రోజులు ఉపయోగించగానే, తెల్లమచ్చలు రంగు మారి మరి కొద్ది రోజులలో స్వభావసిద్ధమైన చర్మపు రంగుగా మారును. ఒకసారి ఉపయోగించి అది ఎట్లు పని చేయునో చూడండి. పై పూతకు మందు రు. 10/-లు. లోపలకు తీసుకొనుటకు రు. 10/-లు. / Address:—
Samaj Kalyan(R·L·-15)
P. O. Katri Sarai (Gaya).

వటం నీ వంతు. నిన్ను సంరక్షించి స్కూలుకి పంపటం నా వంతు ఎవరి పని వారు చేస్తే ఎవరేమడిగినా చెప్పగలవు కదమ్మా జానకీ!"

కనురెప్ప, కంటిపాపలవంటి ఆ తల్లీ కూతుళ్ళ అనుబంధం ఎంత విచిత్రంగా సృష్టించాడో ఆ భగవంతుడు!

రంగు రంగుల తోరణాలలో. జండాలతో స్కూలు ఆవరణ. దేశ నాయకుల ఫొటోలతో స్టేజీ చాలా విడ్డూరంగా, కనుల కింపుగా అలంకరించారు మైదానంలో.

డి. ఇ. ఒ. గారు అధ్యక్ష, బహుమతీ ప్రదాన కర్తగా విచ్చేశారు. ఉపన్యాసాలు ముగిశాయి. బహుమతి ప్రదానం ప్రారంభ మైంది. ఒక్కొక్కర్నీ పిలుస్తున్నారు. కాని, జానకి పేరు పిలవటం లేదు.

అందరికీ బహుమతులు అందిపోయి నట్లే వున్నాయి. ఇంతలో మైక్ లో మాటలు.

"అందరూ ఆశ్చర్యపడుతున్నారు కదూ! జానకి స్టేజీ మీదకి రాలేదేమని. ఆమె ఒకర్తికే అయిదు మొదటి బహుమతులు వచ్చాయి. ఆమెని ప్రత్యేకంగా అభినందించాలని, ఆమెతో స్టేజీపైన మాట్లాడాలని మన డి. ఇ. ఒ. శ్రీమతి కమలగారు చెప్పగా ఆమెని పిలవలేదు. కుమారి జానకి వెంటనే స్టేజీ పైకి రావాలి.

ఎదురు చూస్తున్న జానకి పరుగున స్టేజీ ఎక్కింది. ఒక్కొక్క బహుమతి చదువుతుంటే డి. ఇ. ఒ. గారి చేతుల మీదుగా అందుకుంది జానకి. బహుమతులందుకున్న జానకి అందరిలాగనే స్టేజీ దిగిపోవాలనుకుంది. వుండమన్నారు డి. ఇ. ఒ. గారు. మైక్ ముందుకి వచ్చి జానకిని "ఎవరమ్మాయివమ్మా?" అని ప్రశ్నించేరు. అంతవరకు జానకిని పొగిడిన డి. ఇ. ఒ. గారే ఇప్పుడు ప్రశ్నించేరు ఏదో గుర్తొచ్చినట్టు.

"క్లాక్ ఆఫీసులో పనిచేస్తున్న కరుణ గారి అమ్మాయిని మేడమ్."

"నాన్నగారేం చేస్తున్నారమ్మా, ఆయన పేరు."

"మా అమ్మకి పెళ్ళి కాలేదండి" అందరూ పకపక నవ్వుతున్నారు. హెడ్ మిస్ట్రెస్ వారించి జానకికి అర్థం కాలేదేమో అన్నట్లు అడిగేరు.

"అదేమిటమ్మా జానకీ! మీ డాడీ పేరు అడుగుతున్నారు."

"అవును మేడమ్. నేను చెప్పింది నిజమే. మా అమ్మకి పెళ్ళి కాలేదు."

హెడ్ మిస్ట్రెస్, డి. ఇ. ఒ గారు "బహుశా వారి నాన్నగారు చనిపోయి వుంటార"ను కుంటున్నారు ఇంగ్లీషులో. జానకికి ఆ మాటలు అర్థమయ్యాయి. అందుకే,

"నో మేడమ్. మై మదర్ ఈజ్ అన్ మేరీడ్."

"అది కాదమ్మా. జానకి నాన్నగారు వుండే వుంటారు. ఇప్పుడు నీకు ఇయ్యబోయే సర్టిఫికేట్ లోకూడా వారి పేరు వ్రాయాలమ్మా" ఇంతలో జ్ఞాపకం వచ్చినట్లు జానకిని "సరే నువ్వెళ్ళు జానకీ" అని పంపేసి రికార్డు చూడమన్నారు.

బహుమతులతో ఇంట్లో అడుగుపెట్టిన కూతురు జానకిని "ఏమ్మా బాగా జరిగిందా అన్ని ప్రైజులూ ఇచ్చేశారా?"

"ఇచ్చారు.... ముష్టి ప్రైజులు."

"అదేమిటి జానకీ!"

"నీకేమీ తెలియవు. వచ్చి వుంటే నీ కూతురి అవమానాన్ని కళ్ళారా చూసి మురిసిపోయేదానివి" ఎదిరించలేని కూతురికి కన్నీరే చేరువైంది.

"ఎవరమ్మా? నిన్ను అవమానించింది? ఏమన్నారమ్మా?"


"అందరూ అవమానించేవారే. తండ్రి పోయి వుంటారని ఒకరు. ఎంతమంది తండ్రులో అని ఒకరు.... ఛీ.... ఛీ...."

కరుణని ఎడా పెడా చెంపదెబ్బలు కొడుతున్నట్లే వున్నాయి ఆ మాటలు. జానకికి వయసు వస్తోంది. ఈ తరుణంలో ఆమెలో చెడు పరిణామాలు మొలకెత్తటానికి వీల్లేదు.

"ఎందుకు అన్నారు? ఎవరన్నారు? జానకి?"

"ఇంతకాలం స్నేహితులు అడుగుతున్నారంటే మా అమ్మకి పెళ్ళి కాలేదని చెప్పమన్నావు. ఈ రోజు డి. ఇ. ఒ.





"జీవితంలో వసంతం"లో ప్రభ, చంద్రకళ

గారు అడిగినా అదే చెప్పాను. ఆవిడతో పాటు అందరూ నవ్వారు. పదే పదే నన్ను అదే ప్రశ్న వేశారు. నాన్నగారు పోయారని వారనుకుంటుంటే నేనే కాదని చెప్పాను. వెళ్ళిపోమన్నారు. వచ్చేస్తుంటే రోజూ నన్ను రాసుకు తిరిగే నా స్నేహితులే నన్ను చూసి దూరంగా తప్పుకుంటున్నారు. అమ్మా డి. ఇ. ఓ. గారు తండ్రి, తండ్రికి పేరు లేకపోవడం జరగదన్నారమ్మా-ఎవరమ్మా? అతండి?"

"జానకీ!"

"కోప్పడకమ్మా. నువ్వు కోపంగా చూస్తే నేనేమీ మాట్లాడలేను. కాని నాకు దూరం అవుతున్న స్నేహితులతో ఎలా కూర్చుని పాఠాలు నేర్చుకోగలనమ్మా."

"కోపడ్డంలేదమ్మా ఇంతవరకూ ఎందుకు దాచానా అనే బాధపడుతున్నాను."

"దాచావా....అయితే....?"

"వారనుకుంటున్నదేదీ కరెక్టు కాదమ్మా."

"మరైతే...?"

వీధిలో జీపు ఆగింది. జానకి బయటికి వెళ్ళి చూస్తే ఇంకెవరు? డి. ఇ. ఓ.గారు: హెడ్ మిస్ట్రెస్‌గారు తల్లితో చెప్పింది. కరుణ ఇద్దర్నీ ఆహ్వానించి కుర్చీపై కూర్చోపెట్టి కాఫీ తయారుచేసిఇచ్చి ఎదురుగా కూర్చుంది.

డి. ఇ. ఓ. గారే మాటని ప్రారంభిస్తూ "ఇంత తెలివైన జానకి"కి తల్లిగా మిమ్మల్ని అభినందించాలని వచ్చాను."

ఎండిన గోగుపుల్ల "టపక్" మని విరిచి పొయ్యిలో పెట్టినట్లు "లేదు, జానకి తండ్రి ఎవరో తెల్సుకుందామని వచ్చారు."

"పొరపాటు పడకండి. మీతో మాట్లాడాలనే వచ్చాను. తప్పంటే మరేం అనుకోకండి."

"అడగండి మీకే కాదు,మీవల్ల ఇప్పుడు జానకికి కూడా చెప్పేయవలసివచ్చింది."

"అదే జానకి మా అమ్మకి పెళ్ళి కాలేదని చెప్పింది. రికార్డులో వుంటుందేమో అనుకుంటే తండ్రిగారి గురించి వ్రాయవలసిన చోట కన్య పెంచుకున్న అనాథ అని వ్రాశారు. మరి అప్పుడు ఎలా దానిని అంగీకరించారో అర్థం కావటంలేదు. అయినా ఇంకో ముఖ్య విషయం. నేను అధికారిగా రాలేదు. అవసరార్థం వచ్చేను. దానికి కొన్ని విషయాలు చెప్పాలి.

"నేను కాలేజీలో చదువుకుంటున్నపుడు ఒక బోయ్ ఫ్రండ్‌తో కలిసితిరిగాను. చాలా కాలం జాగ్రత్తగా వుండి ఇరువురి మధ్య శారీరక సంబంధానికి తావివ్వలేదు. కాని ఒకరోజు గుడ్డిగానే బురదలో అడుగు పెట్టామని చెప్పాలి. దాని ఫలితంగానే నా కడుపులో బిడ్డ తయారైంది. తండ్రిలేని నేను, నాకు తను, తనకి నేనే అయిన తల్లి దగ్గర వుంటున్న నేను తల్లిని కాబోతున్నానని తెల్సుకున్న నా తల్లి కళ్ళు మూసింది. అతనే నన్నొక ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో జాయిన్ చేసి చాలా జాగ్రత్తగా చూస్తుంటే నా సంతోషానికి అవధుల్లేవు. డెలివరీ వచ్చింది. ఆయన వస్తారు. పాపని చూస్తారని నేను ఎదురు చూస్తుంటే అక్కడి నర్సు నాకు ఇమ్మని ఆయన ఇచ్చిన కవరు అందించింది, ఆ కవర్లో మరేమీ లేదు. "గుడ్‌బై-క్షమించు" అని పెద్ద అక్షరాలతో వ్రాసిన కాగితమే వుంది. అయితే నాకు ఆయన చేసిన ఉపకారం ఆ హాస్పిటల్‌కి డబ్బంతా ఆయనే ఇచ్చి వెళ్ళిపోతూ, నాకు ఇమ్మనమని రెండొందలు ఇచ్చి వెళ్ళిపోయారు. అప్పుడు నేను ఈయనకి అభిమానం ఎంత వున్నా దానికి రెండింతలు భయం కూడా వుందనుకున్నాను. పాపని తీసుకుని ఉద్యోగం కోసం తిరుగుతున్న నేను అనాథశరణాలయానికి వెళ్ళి ఏదేనా ఉద్యోగం ఇమ్మన్నాను. లేదన్నారు. నన్ను వింతగా చూస్తూ 'ఆ పాప నీ పాపేనా?' అని అడిగేరు. హీనపడవలసి వస్తుందని ఎవరి పాపో చెరువుగట్టున దొరికిందని, ఇంట్లోవారు అనుమానించి తగిలేశారని చెప్పాను. అక్కడ వున్న వారంతా ఆ పాపని ఆ శరణాలయానికి అప్పగించేయమని చెప్పేరు. కాని నా మనస్సు అంగీకరించలేదు. అందులో పని చేస్తున్న ఒకామె ఆమెకూడా వివాహం కానప్పటికీ, ఎప్పటికీ ఏలోటూ రాకుండా చూసుకుంటానని నన్ను ఎక్కడైనా వుద్యోగం చూసుకుని వచ్చి పాపని తీసుకెళ్ళమని చెప్పారు.

ఉచితము : ఉచితము :

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను. ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలు

BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)

నాకు వుద్యోగం దొరికి నేను వెళ్ళేసరికి అక్కడ నా సంఘటన నన్ను తెలిసిన ఒక్క స్వీపర్ మాత్రమేవుంది. ఆమె నా పాపని పెంచుతున్న ఆమెకి ప్రభుత్వ సర్వీసు వచ్చిందని వెళ్ళిపోయిందని చెప్పింది.

నా విధి నిర్వహణలో ఎక్కడైనా అటువంటి వాటికి సంబంధించిన విద్యార్థిను లుంటే స్వయంగా వారి విషయాలు కనుక్కొని నా పాప ఎప్పటికైనా దొరుకుతుం దేమో అని చూస్తున్నాను. అందుకని..

"మా జానకి విషయంఅడుగుతున్నారు. జానకి మీరు ఆశించిన వారిలో ఎన్నోవది"

"ఆరవ అమ్మాయి అవుతుంది."

"ప్రతి తల్లీ బిడ దొరికేవరకూ పడే ఆరాటం, దొరికిన తర్వాత వుండదు."

"ఏ సుఖ సంతోషాలకీ నోచుకోని నాకు బిడ్డ దగ్గరుంటే అదే చాలు."

"అయితే జానకి మీ అమ్మాయే."

"ఏమండి?"

"అవును. అప్పుడు శరణాలయంలో పని చేసినది నేనే. నేను మిమ్మల్ని గుర్తించటానికి గుర్తుంచుకున్న వాటిలోకి మీ కంఠంమీది ఆ పుట్టుమచ్చ."

అంతవరకూ అన్నీ వింటున్న జానకి తల్లి ఒడిలో వాలిపోయి వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఏ తల్లి. కన్నతల్లి కాదు, కళ్ళలో పెంచుకున్న తల్లి ఒడిలోకి వెళ్ళనంటోంది.

"అమ్మా. నేను వెళ్ళ నమ్మా. ఈ అమ్మని వదిలి ఎక్కడికీ వెళ్ళనమ్మా. నీ మనస్సు బాధపెట్టేనని తగిలేస్తున్నావు. ఎంత అవమానాన్నైనా భరిస్తాను. కానీ మరెప్పుడు ఏమీ అడగనమ్మా."

కరుణ జానకిని లేవదీస్తూ "లే, జానకీ. ఏమిటిది? ఆవిడేనమ్మా మీ అమ్మ. నీవడిగే ప్రశ్నలకి జవాబు చెప్పగలరమ్మా." గుండెతో పాటుగా గొంతుక కళ్ళు బరు వెక్కిన కరుణ మాటలు.

తల్లి చీర కొంగుతో కళ్ళు వత్తుకు డి. ఇ. ఒ. ప్రక్కన కూర్చుని "ఏమండీ మీ.... మీ.... అదే.... నాన్నగారు వున్నారా?"

కమల ఏమని చెప్తుంది. అసలు తనకి తెలుస్తేకదా.

జానకే ఇంకా అడుగుతోంది. "పోనీ పేరు."

"కుమార్ అంటారమ్మా."

"పూర్తిపేరు అతనెప్పుడైనా చెప్తేకదా అడిగితే నాకు తెలియకుండా శుభలేఖలు వ్రాస్తావా?" కొంటెగా ప్రశ్నించేవాడు.

"అయితే మీకు తెలియదా?"

".... .... ...."

"నాన్నగారితో మీకు పెళ్ళయిందా?"

"........"

"కరుణ" ఒడిలోకి చేరుకుని "అమ్మా! ఆవిడకీ పెళ్ళికాలేదు, నాన్నగారి పేరు తెలియదు."

"అది కాదమ్మా, జానకీ."

"ఏది కాదమ్మా? నాకు తండ్రి లేరు. అమ్మ వుంది. కాని అమ్మకి పెళ్ళికాలేదు. ఎవరేమనుకుంటే నాకేమమ్మా. చల్లని అమ్మ మనస్సువుంది" తల్లిని కౌగలించుకుంది జానకి.

కన్నీటిని ఒత్తుకుంటూ డి. ఇ. ఒ. కమల లేవగా, హెడ్ మిస్ట్రస్ కూడా లేచారు. జానకిని ప్రక్కకినెట్టి కరుణ నిలబడి కమలని అడ్డగించింది.

"వద్దండి జానకి ప్రశ్నలకి జవాబు లివ్వగలిగినప్పుడే వస్తాను."

"ఏమండీ!"

"ప్రేమానురాగాలతో పెరుగుతోంది జానకి, మీ దగ్గరే వుంచండి- వస్తాను."

జానకి డి. ఇ. ఒ. హెడ్ మిస్ట్రెస్‌లకు ఎదురుగా వచ్చి డి.ఇ.ఒ.తో "మేడమ్ రాలేదని బాధపడుతున్నారా? మీ దగ్గరకి వచ్చినా మా అమ్మకి పెళ్ళి కాలేదు, తండ్రి పేరు తెలియదనేగా చెప్పాలి. దాని కోసం అక్కడ నేను, ఇక్కడ అమ్మ బాధపడటం దేనికి? నన్ను క్షమించండి. మీరే తరచు వస్తూ వుండండి."

కమల కాళ్ళకి నమస్కారం చేసింది. నిండు మనస్సుతో ఆశీర్వదించి కదులుతున్న జీపులో కూర్చున్న కమలకి, ఆమెనే చూస్తూన్న కరుణకి జానకి మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి.

"మా అమ్మకు పెళ్ళి కాలేదు."

★

## గాథావళి:

# పట్టువదలని విక్రమార్కుడు

ఇంగ్లండులో గన్వే అనే వర్తకుడు ఉండేవాడు. అతడు ఆసియాఖండంలో పర్యటించి 1750 వ సంవత్సరంలో చైనా నుంచి తిరిగి వెళుతూ వింత వస్తువులను కొన్నిటిని తీసుకువెళుతూ గొడుగును కూడా కొనుక్కొని వెళ్ళాడు. అంతకు ముందు ఇంగ్లండు తదితర యూరప్ దేశాల వారికి గొడుగు అంటే ఏమిటో తెలియదు.



ఒకమారు వర్షం పడుతుండగా గన్వే గొడుగు వేసుకుని బజారులోకి వెళ్ళాడు. అతడిని, అతని చేతిలోని వింత వస్తువును చూసి బజారులో వెళ్ళేవారంతా నవ్వసాగారు. అంతేగాని గొడుగు వలన లాభాన్ని వాళ్ళెవరూ గ్రహించలేదు.

గన్వే ధైర్యం సడలిపోకుండా "నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు" అనుకుని పదేపదే వాడటం ప్రారంభించాడు. క్రమక్రమంగా అనేకులు అతనిని అనుసరించడం ప్రారంభించారు. అలా గొడుగు యూరప్ దేశాల్లో ప్రచారంలోకి వచ్చింది.

—పి. యస్. ప్రసాద్

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!